



స్టార్ త్రినేత్రం

PRGI NO : TGTEL /25/A0438

అనుక్షణం అక్షరసత్యం

తెలుగు దినపత్రిక




వరంగల్ | సంపుటి : 1 | సంచిక : 202 | ఎడిటర్ : డీ.శివకృష్ణ | శనివారం, 27-12-2025 | పేజీలు: 4 | వెల: 2

WARANGAL VOL-1 ISSUE-202 Editor: D.SHIVAKRIHSNA SATURDAY, 27-12-2025 Pages: 4 Price: 2

# దూకుడు పెంచిన కేసీఆర్..

**ఫామ్ హౌస్ లో కీలక సమావేశం**



**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్ :**

తెలంగాణలో రాజకీయాలు వేడెక్కాయి. వరుస సమావేశాలతో బీఆర్ఎస్(BRS) అధినేత, మాజీ సీఎం కేసీఆర్(KCR) దూకుడు ప్రదర్శిస్తున్నారు. శుక్రవారం ఎర్రవల్లి ఫామ్ హౌస్ లో కేసీఆర్ కీలక సమావేశం నిర్వహించారు. కేటీఆర్, హరీష్‌రావుతో పాటు ఉమ్మడి మహబూబ్ నగర్, నల్గొండ, రంగారెడ్డి జిల్లాల నేతలు పాల్గొన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహం, బహిరంగ సభల తేదీలపై కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. ఇదిలా ఉంటే.. ఫోన్ ట్యాపింగ్ కేసు(Phone Tapping Case)లో కేసీఆర్‌కు నోటీస్ జారీ చేయాలని ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. అలాగే మాజీ మంత్రి హరీశ్‌రావునూ విచారించే యోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. కేసు దర్యాప్తునకు కంక్లూజన్ ఇవ్వాలంటే వీరిద్దరినీ విచారించాల్సిన అవసరముందని భావిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే త్వరలో వీరిద్దరికీ సమన్లు జారీ చేసి విచారించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. శాసనసభ సమావేశాల అనంతరం సమన్లు జారీ చేసే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో రాజకీయంగా కేసీఆర్ వేగం పెంచడం హాట్ టాపిక్‌గా మారింది.

# కేసీఆర్ అసెంబ్లీకి వస్తే మీ గుండె ఆగిపోతుంది..

**- సీఎం రేవంత్ కు కేటీఆర్ కౌంటర్**



**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్ :**

సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి కేటీఆర్ ఫైర్ అయ్యారు. తిట్ల పురాణం తప్ప రేవంత్ చేసిందేమీ లేదంటూ ఎదురు దాడికి దిగారు. మీరు మాట్లాడే భాష మాకూ వస్తుందన్నారు. కానీ, ముఖ్యమంత్రి కుర్చీకి గౌరవం ఇచ్చి మౌనంగా ఉంటున్నామన్నారు కేటీఆర్. సీఎం రేవంత్ అనవసర శపథాలు మానుకోవాలన్నారు. రేవంత్ ఎలా ఎదిగారో అందరికీ తెలుసన్నారు కేటీఆర్. ఇచ్చిన హామీలు అమలు చేస్తానని రేవంత్ శపథం చేయాలన్నారు. కాంగ్రెస్ కు ఓట్లేసిన ప్రజలు ఇప్పుడు బాధపడుతున్నారని కేటీఆర్ అన్నారు.

కాంగ్రెస్ కు వ్యతిరేకంగా గ్రామాల్లో మార్పు మొదలైందన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యే విషయంలో స్పీకర్ కళ్లుండి చూడలేని ధృతరాష్ట్రునిలా మారారని కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్ ఒక్క ప్రెస్ మీట్ పెడితేనే కాంగ్రెస్ నేతలకు చలి జ్వరం వచ్చిందన్నారు. అలాంటిది ఇక కేసీఆర్ అసెంబ్లీకి వెళ్తే రేవంత్ గుండె ఆగిపోతుందన్నారు. నేను గుంటూరులో చదివితే తప్పేంటి అని కేటీఆర్ ప్రశ్నించారు. నేను ఆంధ్రాలో చదివితే తప్పంటున్నారు.. రేవంత్ మాత్రం ఆంధ్రా అల్లుడిని తెచ్చుకున్నారు అని విమర్శించారు. అమెరికాలో ఎవరి పని వాళ్లే చేసుకుంటారు, నేను కూడా అదే చేశానన్నారు. నేనేమీ దొంగ పనులు చేయలేదు అని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చిన మొనగాడు కేసీఆర్ అని కేటీఆర్ అన్నారు. నేను మా నాన్న పేరు చెప్పుకుంటే తప్పేంటి అని సీఎం రేవంత్ పై ధ్వజమెత్తారు.

"కాంగ్రెస్ పరిపాలనలో ఈ రెండేళ్లలో ఎగవేతలు, కూల్చివేతలు, పేల్చివేతలు తప్ప సాధించింది ఏమీ లేదు. ఎగవేతల గురించి నేను చెప్పాల్సిన అవసరం లేదు. ఆయన పేరు మార్చుకోవాలి. ఎనుముల రేవంత్ రెడ్డి కాదు ఎగవేతల రేవంత్ రెడ్డి. పెద్ద పెద్ద డైలాగులు కొట్టారు. పెళ్లి చేసుకుంటే తులం బంగారం ఇస్తానన్నాడు. సోనియా గాంధీ మీద ఒట్టు అన్నాడు. ఆడపిల్లలకు నెలకు రెండున్నర వేలు ఇస్తానన్నాడు. ప్రియాంక గాంధీ మీద ఒట్టు అన్నాడు. మరి ఎవరికైనా వచ్చాయా? రెండున్నర వేలు, తులం బంగారం వచ్చిందా? ముసలోళ్లను ముంచాడు. 2వేల పెన్షన్ ను 4వేలు చేస్తానన్నాడు. వచ్చాయా? ఇవేమీ కాలేదు కానీ.. ఇప్పుడు కోటి మంది ఆడోళ్లకు కోటి చీరలు ఇస్తాడంట.. తెలంగాణలో రెండు కోట్ల మంది ఆడపిల్లలు ఉంటే అందులో కోటి మందిని కోటీశ్వరులను చేసేదాకా విడిచిపెట్టడట. ఎలా ఉందంటే.. నెలకు రెండున్నర వేలు ఇవ్వడానికి ముఖం లేని వ్యక్తి కానీ కోటి మంది ఆడపిల్లలను కోటీశ్వరులను చేస్తానంటున్నాడు. కోటి మందిని కోటీశ్వరులను చేయాలంటే ఎన్ని కోట్లు కావాలో తెలుసా. కోటి కోట్లు కావాలి. మన బడ్జెట్ 3 లక్షల కోట్లు. ఎన్ని రోజులు కావాలి మరి. మీరు నేను బతికుంటామా" అని కేటీఆర్ అన్నారు.



# న్యూఇయర్ వేళ.. పబ్‌లు, హోటళ్లకు పోలీసుల వార్నింగ్..

**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్ :**

న్యూఇయర్ వేడుకలకు హైదరాబాద్ నగరం రెడీ అవుతోంది. కొత్త సంవత్సరానికి గ్రాండ్ గా వెల్ కమ్ చెప్పేందుకు నగరవాసులు సిద్ధమవుతున్నారు. నూతన సంవత్సర వేడుకలకు ఓ రేంజ్ లో ప్రిపరేషన్స్ చేస్తున్నాయి హోటల్స్, పబ్స్. ఈ క్రమంలో హైదరాబాద్ పోలీసులు అలర్ట్ అయ్యారు. న్యూ ఇయర్ వేడుకలపై పోలీసుల కఠిన నిఘా పెట్టారు. న్యూ ఇయర్ వేళ హైదరాబాద్‌లో జీరో డ్రగ్స్ లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. న్యూఇయర్ వేళ డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపనున్నారు. పబ్‌లు, హోటళ్లకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని పబ్ లు, హోటల్స్ కు సీపీ సజ్జనార్ హెచ్చరించారు. డ్రగ్స్‌కు జీరో టాలరెన్స్ అని తేల్చి చెప్పారు. రాత్రి 1 గంటకే పబ్‌లు, హోటళ్లు మూసివేయాలన్నారు. న్యూ ఇయర్ వేళ నగరమంతా నిఘా పెడతామన్నారు. చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామన్నారు.




# సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్ :**

భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆవిర్భావ శతాబ్ది ఉత్సవాలు దేశవ్యాప్తంగా ఘనంగా కొనసాగుతున్నాయి. పార్టీ ఆవిర్భావ దినోత్సవమైన డిసెంబర్ 26 సందర్భంగా రాష్ట్రాలు, జిల్లాల వారీగా సీపీఐ కార్యాలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇక తెలంగాణలోని హైదరాబాద్‌లో ఉన్న సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూం భవన్‌లో రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పార్టీ జెండా ఆవిష్కరణ చేసి, అమరవీరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఐ భారత గడ్డపై ఆవిర్భవించి నేటికీ వందేళ్లు అవుతోందని అన్నారు.

తాము ఎప్పుడూ ప్రజల పక్షమే వహిస్తామని, ప్రజల సమస్యలపై ప్రభుత్వాలపై పోరాడుతామని పేర్కొన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లోనూ అనకాపల్లి, ఒంగోలు తదితర జిల్లాల్లో సీపీఐ కార్యాలయాల్లో శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించి, పార్టీ చరిత్ర, త్యాగాలు, ప్రజా పోరాటాలను గుర్తుచేశారు. సీపీఐ శతజయంతి వేడుకలు ఖమ్మం జిల్లాలో నిర్వహించనున్న భారీ సభతో ముగియనున్నాయి.

# కబ్జాలను అడ్డుకుంటుంటే కేటీఆర్‌కు భయమెందుకు?

**ఎంపీ చామల కిరణ్ కౌంటర్**

**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్ :**



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలపై భువనగిరి ఎంపీ చామల కిరణ్ రెడ్డి ఘాటుగా స్పందించారు. కేటీఆర్ బుద్ధి, జ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో కౌంటర్ ఇచ్చారు. ఈ మేరకు ఆయన ఒక వీడియో విడుదల చేశారు. కేసీఆర్ కుటుంబం నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో ప్రజలను వంచించి అప్పుల పాలు చేసిందని, కేవలం తమ సొంత సంపదనే పెంచుకుందని ఆరోపించారు. రేవంత్ రెడ్డి మెరిట్ కోటాలో సీఎం అయితే, కేటీఆర్ మేనేజ్‌మెంట్ కోటాలో మంత్రి అయ్యారని ఎద్దేవా చేశారు.

▶ మిగతా 2లో

# నాయకులు తిట్టుకుంటున్నారంటే పాలనలో విఫలమైనట్టే..



**బండి సంజయ్ షాకింగ్ కామెంట్స్**


**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్ :**

తెలంగాణ రాజకీయాల్లో అభివృద్ధి మాట వినిపించడంలేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. ఎక్స్ వేదికగా చేసిన పోస్టులో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. అధికారంలో ఉన్నవారు, అధికారం కోసం ఆరాటపడేవారు అసభ్య పదజాలంతో దూషించుకుంటున్నారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, కేసీఆర్ ప్రజాచర్చను వదిలేసి బూతు పురాణం అందుకున్నారని విమర్శించారు. నాయకులు తిట్టుకుంటున్నారంటే వాళ్లు పాలనలో విఫలం అయినట్టేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి గురించి మాటలు లేవని, జవాబుదారీతనం లేదని ఆరోపించారు. భాషపై ఉపన్యాసాలు ఇచ్చే పార్టీలే ఇప్పుడు రాజ్యాంగ వేదికల నుండి అసభ్యకరమైన పదాలను ఉపయోగిస్తున్నాయని మండిపడ్డారు. తెలంగాణకు ఉద్యోగాలు, పెట్టుబడులు, రైతులకు ఆదాయమార్గాలు, పట్టణాల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు అవసరం అని స్పష్టం చేశారు. కానీ అధికారపార్టీ మరియు ప్రతిపక్షాల మధ్య తిట్ల పురాణం అవసరం లేదన్నారు. ప్రజలు మంచి ప్రభుత్వం కోసం ఓటు వేశారని, కానీ 2014 నుండి గట్టర్ పాలిటిక్స్ యే జరుగుతున్నాయని ఆరోపించారు.

# కొత్త ఏడాది నీళ్ల పంచాయతీతో పాలిటిక్స్ షురూ..

**పరస్పర ఆరోపణలతో దద్దరిల్లనున్న అసెంబ్లీ**

**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్ :**




రాష్ట్ర రాజకీయాలు కొత్త సంవత్సరం ప్రారంభం నుంచి రసవత్తరంగా సాగనున్నాయి. నది జలాలపై పోరాటానికి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఇప్పటినుంచే ప్రిపేర్ అవుతున్నాయి. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై ప్రభుత్వ వైఫల్యాలు అంటూ బీఆర్ఎస్ ఉద్యమాలు, బహిరంగ సభలకు ప్లాన్ చేస్తున్నది. త్వరలోనే తేదీలనూ వెల్లడించనున్నది. ఈ నేపథ్యంలో నీళ్లు.. నిజాలు పేరుతో వాస్తవాలను ప్రజలకు తెలియజేయడంతో పాటు ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టడానికి కాంగ్రెస్ సిద్ధమవుతున్నది. అందులో భాగంగా ప్రతిపక్షాలను ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై మొదట కాంగ్రెస్ ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించి వారి సందేహాలను పార్టీ పెద్దలు నివృత్తి చేయనున్నారు. గత ప్రభుత్వ తప్పిదాలను ఎత్తిచూపేందుకు ఆధారాలతో సహా డాక్యుమెంట్స్ అందించనున్నారు. ఇందుకు నీటిపారుదల శాఖ అధికారుల క్రిస్మస్ సెలవులను సైతం రద్దు చేసి సమగ్ర వివరాలను తయారు చేయిస్తున్నారు. గత ప్రభుత్వం సంతకాలు చేసిన డాక్యుమెంట్స్, జీవోలు, సర్క్యులర్లు, కేంద్రానికి రాసిన లేఖలు ఇలా పూర్తి వివరాలు, వాటికి ఆధారాలను బయటపెట్టి ప్రజాప్రతినిధులకు అందించనున్నారు. నది జలాలపై వచ్చే నెల 1న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులకు ప్రజాభవన్‌లో ఓరియేంటేషన్ ఇవ్వనున్నారు.

▶ మిగతా 2లో

మొదటిపేజీ తరువాయి

## కబ్జాలను అడ్డుకుంటుంటే కేటీఆర్‌కు భయమెందుకు?

రేవంత్ రెడ్డి ఇండిపెండెంట్‌గా జడ్పీటీసీ, ఎమ్మెల్యేగా గెలిచారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా గెలిచి, ప్రస్తుతం సీఎం అయ్యారని ఆయన గుర్తుకు చేశారు. మెరిట్ కోటా, పేమెంట్ కోటా, మేనేజ్‌మెంట్ కోటా ఎవరిదో తెలంగాణ ప్రజలకు తెలుసని అన్నారు. రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడుగా అయిన తర్వాతనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని తెలిపారు. ఎప్పుడు అధికారం తమకే ఉంటుందని బీఆర్ఎస్ హయాంలో నియంత పాలన చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైడ్రా కూల్చివేతలు ప్రజల ప్రయోజనం కోసమేనని, అక్రమ కబ్జాలను అడ్డుకుంటుంటే కేటీఆర్ ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు.

## కొత్త ఏడాది నీళ్ల పంచాయతీతో పాలిటిక్స్ షురూ..

గోదావరి, కృష్ణా నది జలాలు, ప్రాజెక్టుల కేటాయింపులు, పూర్తైన ప్రాజెక్టులు, కొనసాగుతున్న ప్రాజెక్టులు, బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపులు, బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్, ప్రస్తుతం కొనసాగుతున్న ట్రిబ్యునల్ వాదనలు, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు డీపీఆర్ తిరస్కరణ ఎప్పుడయిందనే వివరాలను తెలియజేయనున్నారు. అనంతరం 2న కృష్ణా, 3న గోదావరి జలాలపై అసెంబ్లీలో చర్చించనున్నారు.

**కృష్ణా నుంచి 290 టీఎంసీలకు మించలేదు**

కృష్ణా జలాల్లో తెలంగాణకు కేటాయించిన 34శాతం నీళ్లను రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు ఏనాడూ వాడుకున్న దాఖలాలు లేవు. కృష్ణా నదిపై ప్రతిపాదించిన ప్రాజెక్టు నిర్మాణాలు ఏవీ పూర్తిస్థాయిలో కంప్లీట్ కాకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. మహబూబ్‌నగర్ జిల్లాలో చేపట్టిన ప్రాజెక్టున్ని పూర్తయితే మరో 240 టీఎంసీలు వాడుకోవడానికి చాన్స్ ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందులో బీమాకు 20 టీఎంసీల నికర జలాలు ఉండగా మిగిలిన వాటికి నీటి కేటాయింపులు అధికారికంగా లేవు. ఎస్ఎల్‌బీసీకి 40 టీఎంసీలు, కల్వకుర్తికి 53 టీఎంసీలు, నెట్టెంపాడుకు 25 టీఎంసీలు, దిండికి 30 టీఎంసీలు, పాలమూరు-రంగారెడ్డికి 90 టీఎంసీలు ఇలా అన్నిటిని కలిపితే 240 టీఎంసీలకు వరకు ఉండనుంది. ఈ ప్రాజెక్టులు పూర్తికాకపోవడంతో ఏపీ పోతిరెడ్డిపాడును పెద్దగా చేస్తూ బెసిన్‌తో సంబంధంలేకుండా నీటిని పెద్దఎత్తున తరలిస్తోంది. ఈ విషయాలను అధికారిక లెక్కలే స్పష్టం చేస్తున్నాయి. తెలంగాణ గరిష్ఠంగా పుష్కర కాలంలో 286 టీఎంసీలు అత్యధికంగా వాడినట్లుగా అధికారిక లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. ఏపీ అత్యధికంగా 718 టీఎంసీల నీటిని రాయల సీమకు తరలించినట్టు సీడబ్ల్యూసీ స్పష్టం చేసింది.

## బండి రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ పోయినది

నా పేరు బండారి రాజశేఖర్ తండ్రి దుర్గయ్య, ఇంటి నెంబర్ 4-93 చౌదర్పల్లె గ్రామం, అక్కన్నపేట భూంపల్లి మండలం, సిద్దిపేట జిల్లా 502108 తెలంగాణ. గత పది రోజుల క్రితం నేను మా గ్రామం నుండి భూంపల్లి వెళ్ళే క్రమంలో నా జేబులో నుండి పర్సు పడిపోయినది అందులో ఉన్న నా బైక్ (TS 36 D 4876) హీరో ప్యాషన్ ప్రో యొక్క RC కార్డు పాయినది. కావున ఎవరికైన దొరికినచో దయచేసి క్రింద ఇవ్వబడిన ఫోన్ నెంబర్ కి కాల్ చేసి తెలుపగలరు.

**బండారి రాజశేఖర్**, 9849568287.

## 26 ఏళ్లకే వార్డు మెంబర్‌గా గెలిచి ఉప సర్పంచ్ గా ఎన్నికైన చెలుకలపల్లి యువకుడు తడూరి రాకేష్



స్టార్ త్రినేత్రం, సిద్దిపేట: చిన్నకోడూరు మండలం, చెలుకలపల్లి గ్రామంలో ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 25 ఏళ్ల యువకుడు తడూరి రాకేష్ వార్డు మెంబర్‌గా ఘన విజయం సాధించి ఉప సర్పంచ్ గా ఎన్నికయ్యారు. అతి తక్కువ వయస్సులోనే ప్రజల విశ్వాసాన్ని పొందుతూ ఎన్నికల్లో విజయం సాధించడం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. యువతకు ప్రాతినిధ్యం వహిస్తూ పోటీలో నిలిచిన తడూరి రాకేష్, గ్రామ అభివృద్ధి, మౌలిక సదుపాయాల మెరుగుదల, పారదర్శక పాలన లక్ష్యంగా ప్రజల ముందుకు వెళ్లి వారి మద్దతును సంపాదించారు. ముఖ్యంగా యువతతో పాటు మహిళలు, పెద్దలు కూడా ఆయనకు మద్దతుగా నిలవడం విజయానికి ప్రధాన కారణంగా భావిస్తున్నారు. విజయం అనంతరం రాకేష్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి గెలిపించిన గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరినీ కలుపుకుని సర్పంచ్ తో కలసి పనిచేస్తానని, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. అతి పిన్న వయస్సులో ప్రజాప్రతినిధిగా ఎన్నికవడం ద్వారా చెలుకలపల్లి గ్రామంలో యువ నాయకత్వానికి కొత్త దిశ చూపించినట్లు గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు.

## కోరుట్ల బ్రహ్మాకు మారీస్ ఆధ్వర్యంలో జాతీయ రైతు దినోత్సవం వేడుకలు



స్టార్ త్రినేత్రం,వేములవాడ: జాతీయ రైతు దినోత్సవమును పురస్కరించుకుని ప్రజాపిత బ్రహ్మ కుమారీస్ఈశ్వరీయవిశ్వవిద్యాలయం స్థానిక కల్లూరు కోరుట్ల శాఖ వారు జాతీయ రైతు దినోత్సవ వేడుకలు మన్నెగూడెం గ్రామంలో నిర్వహించారు. ఇందులో బీకే రాజేశ్వరి రైతులకు శాశ్వత యోగిక సేంద్రీయ వ్యవసాయ ప్రాముఖ్యతను వివరించారు. గ్రామ సర్పంచ్ దుంపల మనోజ్ - నివేదిత ఆధ్వర్యంలో జరిగిన ఇట్టి కార్యక్రమానికి పలువురు రైతు సోదరులుపాల్గొన్నారు.భగవంతుని తరుపున ప్రతినిధిగా విచ్చేసిన బీకే రాజేశ్వరి కార్యక్రమానికి వచ్చిన వారికి సన్మానం చేసారు.

## శేరిలింగంపల్లి అటల్ బిహారీ వాజపేయి శివరాజయ్య: చింతకింది గోవర్ధన్ గౌడ్



స్టార్ త్రినేత్రం, హైదరాబాద్: అటల్ బిహారీ వాజపేయి శతజయంతి ఉత్సవాల సందర్భంగా శేరిలింగంపల్లి బీజేపీ సీనియర్ నాయకులు శివరాజయ్యని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి చింతకింది గోవర్ధన్ గౌడ్ చందనగర్ లోని వారి నివాసానికి వెళ్ళి సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మా శేరిలింగంపల్లి అటల్ బిహారీ వాజపేయిగా పిలుచుకునే శివరాజయ్యని సత్కరించడం నా అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. శివరాజయ్యతో 1999లో నేను శేరిలింగంపల్లి మండల ప్రధాన కార్యదర్శిగా వున్నప్పటినుండి వారితో అనుబంధం ఉన్నదని అన్నారు . ఆయన ఉపన్యాసాల ద్వార, పార్టీకి సంబంధించిన దేశ భక్తి పాటల ద్వారా కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపేవారని అన్నారు. జనసంఘ్ నుండి పార్టీ పనిచేసిన శివరాజయ్యని సత్కరించడం నా అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు.

# మల్లన్న ఆలయంలో జాతర సందడి

- ఎమ్మెల్యేలు, ఎంపీకి జాతర ఆహ్వానం
- టెంపుల్ ఈవో, ఛైర్మన్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా ఏర్పాట్లు



**స్టార్ త్రినేత్రం, ఐనవోలు:**

ప్రముఖ శైవ క్షేత్రమైన శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయంలో వచ్చే జనవరి మాసంలో ఘనంగా నిర్వహించనున్న మల్లన్న జాతర బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు ఊపందుకున్నాయి. ప్రతి ఏటా లక్షలాది మంది భక్తులు హాజరయ్యే ఈ జాతరను ఈసారి మరింత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ యంత్రాంగం ముందడుగు వేసింది. ఈ క్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్యలను బ్రహ్మోత్సవాలకు హాజరుకావాల్సిందిగా ఆలయ అధికారులు అధికారికంగా ఆహ్వానించారు.

శుక్రవారం ఆలయ ఈవో కందుల సుధాకర్, ఆలయ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్‌లు ఎమ్మెల్యేలు, ఎంపీని వేరు వేరుగా మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మల్లన్న జాతర బ్రహ్మోత్సవాల వివరాలను వారికి తెలియజేశారు. వాల్ పోస్టర్లను అందజేసి, భక్తుల విశ్వాసాలకు ప్రతీకగా నిలిచిన ఈ జాతరలో పాల్గొని భక్తులకు ఆశీస్సులు అందించాలని కోరారు. మల్లికార్జున స్వామి క్షేత్రంలో జరిగే మల్లన్న జాతర తెలంగాణతో పాటు పక్క రాష్ట్రాల్లోనూ విశేష ఖ్యాతి పొందింది. ఈ జాతరకు రాజకీయ, సామాజిక, ఆధ్యాత్మిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరవుతారని ఆలయ అధికారులు తెలిపారు. ఈసారి భక్తుల రాక మరింత పెరుగుతుందని అంచనా వేస్తూ, అన్ని వసతులు సమకూర్చే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఈ ఆహ్వాన కార్యక్రమంలో ఆలయ జూనియర్ అసిస్టెంట్ అద్దంకి కిరణ్, అర్చకులు శ్రీనివాస్‌తో పాటు కాంగ్రెస్ నాయకుడు బొల్లెపల్లి మధు గౌడ్ తదితరులు పాల్గొన్నారు. మల్లన్న జాతర బ్రహ్మోత్సవాలను అత్యంత శ్రద్ధాభక్తులతో, సంప్రదాయ పద్ధతుల్లో, భక్తుల మనసును ఆకట్టుకునేలా నిర్వహించాలనే లక్ష్యంతో ఆలయ యంత్రాంగం పనిచేస్తోందని ఈ సందర్భంగా వారు తెలిపారు.





## గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి ఆర్థిక భరోసా





- భవన నిర్మాణానికి రూ.1 లక్ష విరాళం అందజేసిన నిమ్మాని శేఖర్ రావు
- ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు ఆదేశాల మేరకు అందజేత

**స్టార్ త్రినేత్రం, హన్మకొండ:**

హన్మకొండ జిల్లా ఐనవోలు మండల పరిధిలోని నందనం గ్రామానికి గ్రామ పంచాయతీ భవన నిర్మాణం రూపంలో కీలకమైన అభివృద్ధి అవకాశాన్ని కల్పించారు. వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు ఈ పంచాయతీ భవన నిర్మాణానికి రూ.1 లక్ష ఆర్థిక సహాయాన్ని అందించారు. గ్రామ పరిపాలన మరింత సమర్థవంతంగా సాగేందుకు ఈ భవనం ఉపయోగపడుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సూచనలతో ఈ ఆర్థిక సహాయాన్ని నందనం గ్రామానికి చెందిన ముద్దుబిడ్డ, టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు గ్రామ పంచాయతీకి అధికారికంగా శుక్రవారం అందజేశారు. గ్రామ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న నాయకుడిగా నిమ్మాని శేఖర్ రావు మరోసారి తన సేవాభావాన్ని చాటుకున్నారని గ్రామస్తులు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా గ్రామ ప్రజలు నిమ్మాని శేఖర్ రావును శాలువాతో ఘనంగా సత్కరించారు. గ్రామ అభివృద్ధికి నిరంతరం సహకరిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఆయనకు అభినందనలు తెలియజేశారు. పంచాయతీ భవనం నిర్మాణం పూర్తయితే గ్రామ పరిపాలనకు శాశ్వత వేదిక ఏర్పడుతుందని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఇది ఉపయోగకరంగా ఉంటుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా నందనం గ్రామానికి ఈ సహాయం అందడం పట్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగాలని, గ్రామం అన్ని రంగాల్లో ముందుకు సాగాలని వారు ఆకాంక్షించారు.

## భవిష్యత్తులో గౌడ ముఖ్యమంత్రిని చేయాలి : గోపా గోల్డెన్ జూబ్లీ వేడుకలో వక్తలు..

స్టార్ త్రినేత్రం, హైదరాబాద్: గౌడ్స్ అఫీషియల్స్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (GOPA) గోల్డెన్ జూబ్లీ వేడుకలు హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు.పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్,మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్, శాసన మండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్, జస్టిస్ ఈశ్వరయ్య, శ్రీకాంత్ గౌడ్ లతో కలసి గోపా హెల్త్ కార్డ్ ను ఆవిష్కరించారు. టిపిసిసి చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. సేవ చేసే గుణం కేవలం గౌడ్స్ లోనే ఉంటుందని గోపా 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్నందుకు శుభాకాంక్షలని,గోపా భవన్ కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహాయంతో ఏర్పాటుకు కృషి చేస్తానని, గోపా ద్వారా ఒక నిధిని ఏర్పాటు చేయాలని, గోపా నిధికి తన వంతు సహాయంగా అంకురార్పణగా 10 లక్షల విరాళాన్ని ప్రకటించారు. కుల సర్వేలో 56.3శాతం బీసీల అఫీషియల్ డాక్యుమెంట్ ఉందని, గౌడ్ల ఐక్యతతో రాజ్యాధికారం కోసం ప్రయత్నం చేయాలని కోరారు. గ్రూప్ వన్ లో 11 మంది గౌడ కులస్తులు ఎన్నికైనారని, వారందరికీ గోపా ఆధ్వర్యంలో సన్మానం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గోపా అధ్యక్షులు బండి సాయన్న గౌడ్, ప్రధాన కార్యదర్శి జి



వి శ్రీనివాస్ గౌడ్, రఘునాథ్ గౌడ్, చెక్కిళ్ల మధుసూదన్ గౌడ్,చక్రవర్తి గౌడ్, ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడ జనకల 17వ వార్షికోత్సవం వేడుకల్లో డాక్టర్ జవ్వాజి అంజయ్య గౌడ్ కు సన్మానం



స్టార్ త్రినేత్రం, వేములవాడ: వేములవాడ జనకల 17వ వార్షికోత్సవం వేడుకల్లో సీనియర్ జర్నలిస్టులు అడ్వకేట్లు అధికారులు, మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు, సిటీ కేబుల్ అధినేత ఉమ్మడి జిల్లా బీసీ నేత పాల్గొని డాక్టర్ జవ్వాజి అంజయ్య గౌడ్ కు వేములవాడ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు కోయినేని బాలయ్య వేములవాడ మున్నూరు కాపు సంఘం గౌరవ అధ్యక్షులు నామాల పోశెట్టి, వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం, వేములవాడ మున్సిపల్ మాజి కౌన్సిలర్ మారం కుమార్, పులి మధుకర్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ అధ్యక్షులు పొలాస నరేందర్, నాగారం శ్రీనివాసు ఘన సన్మానం చేశారు వచ్చిన ముఖ్య అతిథులందరికీ 2025 సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ 2026 నూతనత్తేజం సందర్భంగా జనకల వేములవాడ ఆధ్వర్యంలో సీనియర్ జర్నలిస్టులకు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులకు మున్నూరు కాపు సంఘం అధ్యక్షులకు,గౌరవఅధ్యక్షులకు తెలంగాణ స్టేట్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ అధ్యక్షులకు బెస్ట్ పోలీస్ అవార్డు పొందిన హెడ్ కానిస్టేబుల్ కు అధికారులకు మున్సిపల్ కౌన్సిలర్ కు మీడియా ఛానల్ వారికి మా జనకళ వేదిక 17వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని విజయవంతం చేసిన వీరందరికీ మా వంతు చిరు సత్కారం చేయడం జరిగింది వారి యొక్క అనుభవాలు గొప్ప అనుభవాలు ఆ రోజుల్లో జర్నలిస్టులు కలలకు జీవం పోసి కలలు బ్రతికించిన ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా వారి యొక్క ఆశయాలతో వేములవాడ ప్రాంతం నుంచి ప్రపంచ స్థాయిలోనికి నన్ను ముందుగా తీసుకుపోయి రాజన్న సిరిసిల్ల జిల్లా కళాకారులుగా ఎదుగుతున్నారంటే ఆనాటి జర్నలిస్టులే ఈనాటి వరకు ముఖ్యపాత్ర పోషించారు ఈనాడు ఈ వేదికపై మా యొక్క జనకల వేదికపై మా మాకు ఘనంగా సన్మానం చేసి మాతో సన్మాన సత్కారం అందుకున్నారంటే మా కళ మా జన్మధన్మయిందని వారి యొక్క ఆశీస్సులు ఎల్లవేళలా ఇంక ముందు నడిపిస్తారని ఇంకెన్నో వార్షికోత్సవాలు జరుపుకుంటామని వారు వెన్ను దన్ను ఉండి మమ్ములను ముందుకు నడిపించాలని వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు అలాగే తెలంగాణ స్టేట్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ అధ్యక్షులు పొలాస నరేందర్ మాట్లాడుతూ ఈరోజు డాక్టర్ జవాజి అంజయ్య గౌడ్ గారు జనకళ వేములవాడ వార్షికోత్సవం వేదిక పెట్టడం ఎంతో ఆనందంగా ఉంది ఆ వేదిక పైకి ముఖ్య అతిథులుగా పిలవడం చాలా సంతోషంగా అభివర్ణించారు మరుగున పడ్డ కళలను కూడా మట్టిలో మాణిక్యాలుగా ముందుకు తీసుకెళ్లడంఆయనకేదక్కిందన్నారు ఇంకా కలలు కూడా అందుకు తీసుకుపోవాలని మనవేములవాడ ప్రాంతాన్ని జాతీయ అంతర్జాతీయ లేవలో తీసుకపోతున్నారంటే మన వేములవాడలో కళాకారుడిగా ముందుకెళుతుంటే అందరికీ గర్వించదగ్గ విషయం ఎవరొక్కరు ముందుండి తీసుకుపోయిన మనమందరము ఆయన వెంట మనం కూడా సాయి శక్తుల కృషిచేసి నూతన ఉత్తేజాన్ని ఇంకా ముందుకు తీసుకుపోవాలని మనమందరం వెన్నుదన్నుగా ఉండాలని అభివర్ణించారు వేములవాడ ప్రాంతం నుంచి ఎదిగి ప్రపంచ స్థాయిలోనికి తీసుకు వెళ్లడం అంటే వేములవాడకే గొప్ప కళలతో వన్నెతెచ్చారు, వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం మాట్లాడుతూ మనవేములవాడలో జనకల 17వ సంవత్సరం వార్షికోత్సవం ఘనంగా జరపడము ఎంతో ఆనందంగా ఉందన్నారు ఈ వేదికపైకిమమ్ములనుఆహ్వానించడం నాకెంతో ఆనందంగా ఉందన్నారు ఎందరో ఉంటారు కానీ కొందరికే సాధ్యమని అన్నారు కష్టపడితే గాని ఏదైనా సాధించొచ్చు స్వార్థం లేకుండా నిస్వార్థంతో పని చేస్తున్నారంటే ఒక డాక్టర్ జవ్వాజి అంజయ్య గౌడ్ కి దక్కిందన్నారు కానీ జన కల వార్షికోత్స వేడుకల్లో డాక్టర్ గారికి మనమందరము కలిసి ఆయనకు ఘన సన్మానం చేస్తుంటే ఎంతో ఆనందంగా ఉందన్నారు మేము కూడా వేదికపై వారి చేతుల మీదుగా చిరు సాత్కారము అందుకోవడము చాలా సంతోషకరమన్నారు ఇంకా ఇలాంటి ఎన్నో వేదికలు పెట్టి మన వేములవాడ ప్రాంతంలో కళలతో పేరుగాంచాలనిఇంకా ముందుకెళ్లాలని మా బార్ అసోసియేషన్ తరపున వారికి ఏ సహాయం కావాలన్నా చేస్తామన్నారు ఎక్కడ వేదిక పెట్టినా మేం వారికి సహకరిస్తామన్నారు మా ఆశీస్సులుఎల్లవేళలాఉంటాయన్నారు వారు పట్టుదలతో కలలు ముందుకు తీసుకెళుతున్నారు వేములవాడ ప్రాంతంలో ఒక డాక్టర్ జవ్వాజి అంజయ్య గౌడ్ కే దక్కిందన్నారు వారు మా తరపున ఘన సన్మానం అందుకున్నందుకు వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు డాక్టర్ జవ్వాజి అంజయ్య గౌడ్ మాట్లాడుతూ ఈరోజు జనగల వేదిక 17వ సంవత్సరం వేడుకల్లో పాల్గొన్న వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తూ మాకు ఘన సన్మానం చేసి మా చిరు సత్కారం అందుకున్నందుకు వచ్చిన ప్రముఖులు పెద్దలకు అందరికీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు మా కార్యక్రమం వేదికలో పాల్గొన్న వారు రేగుల దేవేందర్ ఎల్.ఎల్.బి అడ్వకేట్ సీనియర్ జర్నలిస్టు వేములవాడ,మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు కోయినేనీ బాలయ్యమున్నూరు కాపుసంఘం గౌరవ అధ్యక్షులు నామాల పోశెట్టి అగ్రహారం దేవస్థానము ఈవో నాగారం శ్రీనివాస్ గడ్డం సత్యనారాయణ రెడ్డి వేములవాడ బారు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సీనియర్ జర్నలిస్టు కొలిపాక నరసయ్య ఎన్ కేబుల్ అధినేత కొక్కుల శ్రీనివాస్ సిటీకేబుల్ అధినేత కంఠం అంజయ్య, టి డబ్ల్యు సి చైర్మన్ బి దేవరాజు,పంపరి శంకరయ్య సీనియర్ జర్నలిస్టు,మారం కుమార్ మున్సిపల్ కౌన్సిలర్ పులి మధుకర్, జనకల వేములవాడ సంస్థ ప్రధాన కార్యదర్శి జన కల వేములవాడ 17వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని డాక్టర్ జావాజ్ అంజయ్య గౌడు కు ఆత్మీయ సన్మానం ఘనంగా వేసినందుకు మా చిరు సత్కారం అందుకున్నందుకు అందరూ పాల్గొని విజయవంతం చేసినందుకు మీ అందరికీ పేరుపేరునా ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు 2025 కు వీడ్కోలు పలికి 2026 లోనికి అడుగుపెడుతున్న సందర్భంగా నూతన ఉత్తేజంతో ముందుకెళ్లాలని కోరకున్నారు

## చలో కలెక్టరేట్ ను విజయవంతం చేయండి

- 252 జీవోను సవరించే వరకు పోరాటం ఆగదు.
- జర్నలిస్టులు హక్కులను కాల రాస్తామంటే సహించేది లేదు.
- టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు లాయక్ పాషా



స్టార్ త్రినేత్రం,వేములవాడ :తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం టి యు డబ్ల్యూ జే హెచ్ 143 రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు తలపెట్టిన ఈనెల 27న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టి యు డబ్ల్యూ జే రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా పిలుపునిచ్చారు. వేములవాడ పట్టణంలోని ప్రెస్ క్లబ్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల జారీ కోసం విడుదల చేసిన నూతన జీవో 252 వర్కింగ్ జర్నలిస్టుల హక్కులను కాలరాసే విధంగా ఉందని మండిపడ్డారు. నూతన జీవో ప్రకారం డెస్క్ జర్నలిస్టులు, కేబుల్ జర్నలిస్టులకు తీరని అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల హక్కులను, సంక్షేమాన్ని కాలరాసే విధంగా ప్రభుత్వం అనుసరించినట్లయితే సహించేది లేదని ధ్వజమెత్తారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన జర్నలిస్టులను గత ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో విస్మరించారన్నారు. మెజారిటీ జర్నలిస్టుల సహకారంతో అధికారంలోకి వచ్చిన ప్రస్తుత ప్రభుత్వం అంతకంటే దారుణంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. నూతనంగా విడుదల చేసిన జీవో నెంబర్ 252 ను వెంటనే సవరించని యెడల రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ నేతృత్వంలో ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృత పరుస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు రేగుల రాంప్రసాద్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మొహమ్మద్ రఫీ, వర్కింగ్ ప్రెసిడెంట్ కొలిపాక నరసయ్య, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు సయ్యద్ అలీ, అబ్దుల్ జబ్బర్, దేవ్వేటి ప్రవీణ్, చేకూర్తి నవీన్ లు పాల్గొన్నారు.

## విశ్వబ్రాహ్మణ అర్చక పూరోహిత సంఘం ఆధ్వర్యంలో తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ.



స్టార్ త్రినేత్రం,సిద్దిపేట: రేఖాంశాన్ని ఆధారంగా చేసుకొని రూపొందించిన ప్రత్యేక తెలుగు క్యాలెండర్‌ను సిద్దిపేట జిల్లా విశ్వబ్రాహ్మణ అర్చక పూరోహిత సంఘం ఆధ్వర్యంలో అధికారికంగా ఆవిష్కరించారు. ఈ క్యాలెండర్ రూపకల్పనను హుస్నాబాద్‌కు చెందిన ప్రముఖ జ్యోతిష్యుడు భాస్కరాచార్య తన కుమారుడు సుధీర్ కుమార్‌తో కలిసి దృక్ సిద్ధాంతం ప్రకారం రూపొందించారు. ఈ క్యాలెండర్ ప్రత్యేకత ఏమిటంటే, ఇది పూర్తిగా సిద్దిపేట రేఖాంశం ఆధారంగా గణించబడటం. ఇందులో తిథులు, వారాలు, నక్షత్రాలు, యోగాలు, పర్వదినాలు తదితర అంశాలను ఖచ్చితమైన గణనలతో పొందుపరిచినట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక అవసరాలను దృష్టిలో ఉంచుకొని రూపొందించిన ఈ క్యాలెండర్ ప్రజలకు, ముఖ్యంగా అర్చక పూరోహితులు, జ్యోతిష్యులు, భక్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని సంఘ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్రంలోని విశ్వబ్రాహ్మణ అర్చక పూరోహిత సంఘం అధ్యక్షులు బుర్గోజు బాల బ్రహ్మచారి, పెందోట ప్రభాకర చారి, పెందోట విష్ణుమూర్తి, కొత్తపల్లి సత్యనారాయణ, వేగ్గలం నరసింహ చారి, పెందోట వెంకటరమణ, సంగోజు సత్యానంద చారి, పెందోట వేణుగోపాల చారి, కోటేశ్వర చారి, రాజ బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను పాల్గొన్నవారు అభినందించారు.

## భార్యను తుపాకీతో బెదిరించిన కేసులో కీలక మలుపు

స్టార్ త్రినేత్రం, అనంతపురం: అనంతపురంలో భార్యను ఓ భర్త ఇటీవల తుపాకీతో బెదిరించాడు. ఈ విషయం స్థానికంగా కలకలం రేపింది. భర్త తుపాకీతో బెదిరించడంతో భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు భార్య ఫిర్యాదు మేరకు జిమ్ ఓనర్ అయిన రాజశేఖర్ ను విచారించారు. కాగా అతను తుపాకీ పొందిన తీరును నిందితుడు వెల్లడించాడు. అనంతపురం ఎస్పీ పి.జగదీశ్ కూపీ లాగడంతో మధ్యప్రదేశ్ ముఠా గన్స్ విక్రయించినట్లు తెలిసింది. దీంతో దర్యాప్తును ముమ్మరం చేసిన అనంతపురం పోలీసులు మధ్యప్రదేశ్ ముఠాలో నలుగురిని స్థానికంగా, మరో ఇద్దరిని మధ్యప్రదేశ్ లో అరెస్టు చేశారు. అయితే చివరి నిమిషంలో గన్స్ సరఫరా చేసే ముఠాలోని కీలక వ్యక్తులు తప్పించుకున్నారు. వారి కోసం గాలించిన పోలీసులు ఎట్టకేలకు నిందితులను పట్టుకోవడంతో కేసు కీలక మలుపు తిరిగింది.

పోలీసుల వివరాల ప్రకారం ముఠాలో కీలకమైన ముగ్గురు సభ్యులను అనంతపురం పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 5 కంట్రిమేడ్ రివాల్వర్లు, 30 బుల్లెట్లు, ఒక కాళీ మ్యాగజైన్, ఒక తల్వార్ ను స్వాధీనం చేసుకున్నారు. మధ్యప్రదేశ్ కు చెందిన ముఠాగా వారిని గుర్తించారు. ఈ మేరకు నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండుకు తరలించారు.

## శ్రీశైలానికి భక్తుల తాకిడి

స్టార్ త్రినేత్రం, శ్రీశైలం : శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయానికి భక్తుల రద్దీ భారీగా పెరిగింది. క్రిస్మస్ సెలవులు, వారాంతపు హాలిడేలు కలిసి రావడంతో వేకువజాము నుంచే భక్తులు క్యూ లైన్‌లలో బారులు తీరారు. క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోగా, శిలాతోరణం వరకు క్యూ లైన్ కొనసాగుతోంది. సాధారణ సర్వదర్శనానికి సుమారు నాలుగు గంటల సమయం పడుతోంది. భక్తుల సౌకర్యార్థం దేవస్థానం అధికారులు క్యూ లైన్‌లలో మంచినీరు, అల్పాహారం, మజ్జిగ, పాలు పంపిణీ చేయడంతో పాటు చిన్నారులు, వృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. అయితే ఆన్‌లైన్‌లో శీఘ్ర దర్శనం, VIP బ్రేక్ టికెట్లు బుక్ చేసుకున్న భక్తులు చాలా సమయం వేచి ఉండాల్సి వస్తోంది. రద్దీ ఎక్కువగా ఉన్న ఈ రోజుల్లో ఆన్‌లైన్ బుకింగ్‌ను ఎంచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# మోదీ నాయకత్వంలో స్థిరమైన ప్రభుత్వం

**స్టార్ త్రినేత్రం, అమరావతి :**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో స్థిరమైన ప్రభుత్వం ఉందని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. తిరుపతి వేదికగా జరుగుతున్న భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్ కార్యక్రమానికి ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ తో కలిసి ఆయన ముఖ్య ఆహ్వానితులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు ప్రసంగించారు. ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో దేశంలో స్థిరమైన ప్రభుత్వ పాలన సాగుతోందన్నారు.

2038 నాటికి భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని స్పష్టం చేశారు. భారత్ ఏర్పడి వందేళ్లు గడిచేనాటికి.. అంటే 2047 నాటికి ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరిస్తుందని, ప్రపంచ శక్తిగా ఆవిర్భవిస్తుందని తెలియజేశారు. దశాబ్దా కాలంగా చాలా దేశాల్లో జన సంఖ్య తగ్గుతోందని అభిప్రాయపడ్డారు. భారత్ లో మాత్రం అందుకున్న భిన్నంగా జన సంఖ్య పెరిగిందన్నారు.

ఆర్ఎస్ఎస్ చీఫ్ దేశానికి అందిస్తున్న సేవలు ఎనలేనివన్నారు. ఎటువంటి పదవిని ఆశించకుండా మోహన్ భగవత్ సమాజానికి సేవ చేస్తున్నారని కొనియాడారు. దేశంలో నాలెడ్జ్ కు కొదవ లేదన్నారు. దాన్ని సద్వినియోగం చేసుకుంటే భారత్ కొత్త పుంతలు తొక్కుతుందన్నారు. అదే




విధంగా భారత్ ప్రపంచానికి అందించిన అమూల్యమైన సంపద యోగా అని పేర్కొన్నారు. మానసిక ఒత్తిడిని అధిగమించడంతో పాటు ఆరోగ్య సంరక్షణలో యోగాది కీలక పాత్రగా పేర్కొన్నారు. విశాఖ వేదికగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించిన విషయాన్ని సీఎం గుర్తు చేశారు.

దేశాభివృద్ధిలో అనేక రంగాల భాగస్వామ్యం ఉంటుందన్నారు. అవన్నీ సమతుల్యంగా ఉన్నప్పుడు సుస్థిరాభివృద్ధి సాకారమవుతుందన్నారు. 1991 ఆర్థిక సంస్కరణల తర్వాత అత్యంత కీలక మార్పులు చోటు చేసుకున్నాయని పేర్కొన్నారు. తిరుపతిలో స్పేస్ సిటీ, కర్నూలులో డ్రోన్ సిటీ, అనంతపురంలో ఏరో స్పేస్ సిటీ, విశాఖలో మెడ్ టెక్ పార్కు వంటివి నిర్మించుకుంటున్నాం అన్నారు. గతంలో తమ ప్రభుత్వం హైదరాబాద్ లో ఐటీని ప్రోత్సహించిందన్నారు. ఐటీ వల్ల ప్రపంచంలో తెలుగువారు ఎక్కువ వేతనాలు పొందుతున్నారన్నారు. అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.

ఇప్పటికే ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా కీలక స్థానాల్లో భారతీయులే ఉన్నారని గుర్తు చేశారు. అంతర్జాతీయ సంస్థల్లో అత్యధిక జీతాలు పొందుతున్నది తెలుగువారేనని అన్నారు. దేశం పేరు ప్రపంచ దేశాల్లో మార్మోగుతుందన్నారు. అది ప్రతి భారతీయుడికి గర్వకారణం అన్నారు. విశాఖ పట్నంలో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గూగుల్ వచ్చిందని గుర్తు చేశారు.

మన పురాణాలను నేటి యువతకు తెలియజేసి వాటిపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అవతార్ సినిమా కంటే రామాయణం, మహాభారతం గొప్పవని పిల్లలకు చెప్పాలన్నారు. సూపర్ మ్యాన్, బ్యాట్ మ్యాన్, ఐరన్ మ్యాన్ కాకుండా అర్జునుడు, హనుమాన్ గురించి వారికి తెలియజేయాలని సీఎం అన్నారు. ఎన్టీఆర్ వంటి గొప్ప వ్యక్తుల గురించి నేటి సమాజానికి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు.జల భద్రత ఉంటే దేశంలో అద్భుత కార్యక్రమాలు చేయగలమన్నారు.

## వరుస సెలవుల ఎఫెక్ట్.. హైదరాబాద్–విజయవాడ హైవేపై ట్రాఫిక్ జామ్

**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్ :**



వరుస క్రిస్మస్ సెలవులు, వీకెండ్ నేపథ్యంలో హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై రద్దీ కారణంగా వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. క్రిస్మస్ తర్వాత ఆఫీసులు, కాలేజీలు, పాఠశాలలు తెరవడంతో ఒకేసారి సిటీ వైపు లక్షలాది మంది ప్రయాణం చేస్తున్నారు. ముఖ్యంగా పంతంగి, చౌటుప్పల్, కోర్లపాడు టోల్ గేట్ల వద్ద కిలోమీటర్ల మేర జామ్‌లు ఏర్పడ్డాయి. నేషనల్ హైవే 65పై ఔటర్ రింగ్ రోడ్ నుంచి అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్, చౌటుప్పల్ ప్రాంతాల్లో బంపర్–టు–బంపర్ ట్రాఫిక్‌తో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఇక 6 లేన్ల రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా చౌటుప్పల్, చిట్యాల, నార్కెట్‌పల్లి, పంతంగి వంటి చోట్ల బ్రిడ్జిలు, అండర్‌పాస్‌ల నిర్మాణాల వల్ల రోడ్డు సామర్థ్యం తగ్గి ట్రాఫిక్ మరింత ఆలస్యమవుతోంది. ఈ పనులు పూర్తయ్యే వరకు ఇలాంటి ఇబ్బందులు కొనసాగే అవకాశం ఉంది. దీంతో అప్రమత్తమైన ట్రాఫిక్ పోలీసులు ప్రత్యామ్నాయ రూట్ల ద్వారా వాహనాలను మళ్లీస్తున్నారు. అంబులెన్స్‌లు సైతం ట్రాఫిక్‌లో చిక్కుకుపోతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక నేషనల్ హైవేపై ప్రయాణించే వారు ప్రత్యామ్నాయ రూట్లలో తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని, నిరంతరం ట్రాఫిక్ అప్‌డేట్‌లను ఆన్‌లైన్‌లో చెక్ చేసుకోవాలని రాచకొండ ట్రాఫిక్ పోలీసులు సూచిస్తున్నారు. ఈ వాహనాల రద్దీ మరో రెండు రోజులు కొనసాగే అవకాశం ఉందని వారు తెలిపారు.

## కాలిఫోర్నియా నిర్ణయాన్ని కోర్టులో సవాల్ చేసిన భారతీయ డ్రైవర్లు

**స్టార్ త్రినేత్రం, కాలిఫోర్నియా :**

కాలిఫోర్నియాలో భారతీయ ట్రక్ డ్రైవర్లు, ముఖ్యంగా సిఖ్ కమ్యూనిటీకి చెందిన డ్రైవర్ల రాష్ట్ర డిపార్ట్‌మెంట్ ఆఫ్ మోటార్ వెహికల్స్ తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ కోర్టును ఆశ్రయించారు. నవంబర్ 2025లో సుమారు 20,000కు పైగా కమర్షియల్ డ్రైవింగ్ లైసెన్స్‌లను రద్దు చేస్తూ నోటీసులు జారీ చేసింది. వాటిని జనవరి 5, 2026 నుంచి అమలు చేస్తామని ప్రకటించడంతో వేలాది మంది డ్రైవర్లు రోడ్డున పడే ప్రమాదం ఉందని ఆరోపిస్తున్నారు. ఫెడరల్ మోటార్ క్యారియర్ సేఫ్టీ అడ్మినిస్ట్రేషన్ నిబంధనల ప్రకారం నాన్–డామిసైల్డ్ హోల్డర్లు కావడం, చిరునామా, పేరు వంటి చిన్న క్లరికల్ పొరపాట్లు, లైసెన్స్ గడువు ముగిసిందన్న కారణాలతో ఈ చర్య తీసుకున్నామని చెబుతోంది.మరోవైపు సిఖ్ కోలిషన్, ఆసియన్ లా కాకస్ వంటి పౌర హక్కుల సంఘాలు ఇవన్నీ తప్పుల వల్లే జరిగాయని, సరిచేసి లైసెన్స్‌లను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో డిసెంబర్ 23న తోపాటు డైరెక్టర్ స్టీవ్ గోర్డన్‌పై కోర్టులో పిటిషన్ దాఖలు చేసారు. తీసుకున్న నిర్ణయం రాజ్యాంగ హక్కులకు విరుద్ధమని, దాదాపు 20,000 మంది ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందని వాదిస్తూ జనవరి 5 నుంచి అమలయ్యే రద్దును నిలిపివేయాలని కోరారు. కాలిఫోర్నియా ప్రభుత్వం కొంతమంది లైసెన్స్‌లను తిరిగి జారీ చేస్తామని ప్రకటించినప్పటికీ, ఈ అంశంపై న్యాయపోరాటం కొనసాగుతోంది.



# పెట్టుబడుల సరళీకరణ చేశాం

## కేంద్రమంత్రి జితేంద్ర సింగ్

**స్టార్ త్రినేత్రం, ఢిల్లీ :**



నరేంద్ర మోదీ ప్రభుత్వ పాలనలో ఐటీ, టెలివిజన్ రంగాల్లో పెట్టబడులు సరళీకరణ చేశామని కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ అన్నారు. తిరుపతిలో సంస్కృత యూనివర్సిటీలో జరుగుతున్న భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్ లకు ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్, సీఎం చంద్రబాబు నాయుడుతో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రసంగిస్తూ భారత్ గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్ లో 81వ ర్యాంకు నుంచి 38వ ర్యాంక్ కు చేరుకుందన్నారు. దశాబ్ద కాలంగా స్టార్టప్ రంగంలో భారత్ దూసుకుపోతోందని పేర్కొన్నారు. స్పేస్ ఎకానమీలో 8వ స్థానానికి చేరుకున్నామని వివరించారు. చంద్రుడిపై ప్రయోగాల్లో కూడా భారత్ ఘన విజయాలు సాధించిందని తెలియజేశారు.గత దశాబ్ద కాలంలో భారత్ రక్షణ రంగ ఎగుమతుల్లో గణనీయమైన వృద్ధి సాధించిందని పేర్కొన్నారు. ముఖ్యంగా బ్రహ్మోస్ క్షిపణుల తయారీ ద్వారా తన సత్తా చాటిందన్నారు. భారత బ్రహ్మోస్ క్షిపణులకు ఇప్పుడు ప్రపంచంలో ఎంతో డిమాండ్ ఉందన్నారు. ప్రపంచానికి కోవిడ్ వ్యాక్సిన్లు అత్యధికంగా ఎగుమతి చేసిన దేశంగా భారత్ నిలవడం గర్వకారణమన్నారు. ప్రపంచ దేశాలకు ఆపన్న హస్తం అందించి ఆదుకునే అవకాశం రావడం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేశారు.శాస్త్ర, సాంకేతిక రంగాలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం భారీ బడ్జెట్ కేటాయింపులు జరుగుతున్నాయి అన్నారు. అంతేకాకుండా ఆర్థికంగా కూడా దేశం పురోగతిని సాధిస్తోందని వివరించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ప్రస్తుతం భారత్ నాలుగో స్థానంలో ఉందన్నారు. అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో భారత్ త్వరలోనే మూడో స్థానానికి చేరుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.అంతేకాకుండా అంతరిక్ష రంగంలో సైతం ప్రైవేటు సంస్థలను కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. కీలక ఖనిజాలను తవ్వితీసే విషయంలో కూడా ప్రైవేటు సంస్థలను కేంద్ర ప్రభుత్వం అనుమతిస్తోందని తెలిపారు.



## ప్రధానమంత్రి జాతీయ బాలల అవార్డు అందుకోనున్న వైభవ్

**స్టార్ త్రినేత్రం, ఢిల్లీ :**

కేవలం 14 ఏళ్ల వయసులోనే తన ప్రతిభతో దేశం దృష్టిని ఆకర్షించిన బీహార్ యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీకి ప్రతిష్టాత్మక ప్రధాన్ మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ లభించనుంది. ఈ అవార్డును స్వీకరించేందుకు ఆయన న్యూఢిల్లీలోకి చేరుకున్నారు. ఈ కారణంగా బీహార్ జట్టు తరఫున విజయ్ హజారే ట్రోఫీలో మణిపూర్‌తో జరిగిన మ్యాచ్ కు గైర్హాజరయ్యారు. న్యూఢిల్లీలో జరిగే ఈ అవార్డు ప్రదాన కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అధ్యక్షత వహించనున్నారు. రాష్ట్రపతి చేతుల మీదుగా వైభవ్‌కు అవార్డు అందజేయనున్నారు.కార్యక్రమం అనంతరం ప్రధాని నరేంద్ర మోడీని కూడా వైభవ్ కలవనున్నాడు. చిన్న వయసులోనే అద్భుత బ్యాటింగ్‌తో గుర్తింపు పొందిన వైభవ్‌కు ఈ గౌరవం ఆయన కెరీర్‌లో ఓ మైలురాయిగా నిలవనుంది. ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్ ధైర్యం, స్పోర్ట్స్, ఆర్ట్స్, సైన్స్ వంటి రంగాల్లో అసాధారణ ప్రతిభ చూపిన 5–18 ఏళ్ల పిల్లలకు ఇస్తారు.

## అదుపుతప్పి లోయలో పడిన బస్సు.. 10 మంది మృతి, 32 మందికి గాయాలు

**స్టార్ త్రినేత్రం, మెక్సికో :**

క్రిస్మస్ పండుగల వేళ బస్సు అదుపు తప్పి లోయలో పడిన ఘటన మెక్సికోలోని వెరాక్రూజ్ రాష్ట్రంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. మెక్సికో సిటీ నుంచి చికోంటెపెక్ గ్రామానికి వెళ్తున్న బస్సు జోంటెకోమట్లాన్ పట్టణం సమీపంలో అతివేగంతో అదుపు తప్పి పక్కనే ఉన్న భారీ లోయలోకి పడిపోయింది. ఈ దుర్ఘటనలో మొత్తం 10 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోగా, 32 మందికి గాయాలయ్యాయి. మరణించిన వారిలో 9 మంది పెద్దలు, ఒక చిన్నారి ఉన్నారని అధికారులు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు స్పాట్‌కు చేరుకున్న పోలీసులు 32 మంది గాయగ్రస్తులను వివిధ ఆసుపత్రులకు చికిత్స నిమిత్తం తరలించారు. మున్సిపాలిటీ అధికారులు గాయపడిన వారి జాబితాను కూడా విడుదల చేశారు. అయితే, క్రిస్మస్ సీజన్‌లో జరిగిన ఈ విషాదకర ఘటన అక్కడి ప్రజల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.ఇటీవల కాలంలో మెక్సికోలో బస్సు, ట్రక్కులతో జరిగే ఘోర రోడ్డు ప్రమాదాలు సర్వసాధారణమయ్యాయి. డ్రైవర్ల అతివేగం, సాంకేతిక కారణాల వల్ల యాక్సిడెంట్లు జరుగుతున్నాయి. కాగా, నవంబరు చివరి వారంలో పశ్చిమ రాష్ట్రమైన మిచోకాన్‌లో కూడా ఒక బస్సు ప్రమాదంలో 10 మంది మరణించగా, మరో 20 మంది గాయపడిన విషయం తెలిసిందే.





# 2025 టాప్‌లో 'ధురంధర్'..

## రూ.1000కోట్ల క్లబ్‌లో చేరిన చిత్రం

రణ్‌వీర్ సింగ్ హీరోగా వచ్చిన 'ధురంధర్' ఊహించని విజయాన్ని సొంతం చేసుకుంది. ఇప్పటికే బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధిస్తోన్న ఈ చిత్రం ఇప్పుడు మరో మైలురాయిని చేరుకొని ఏకంగా రూ.1000 కోట్ల మార్క్‌ను దాటేసింది. అలాగే, 2025లో భారత్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాగానూ నిలిచింది. తొలి రోజు నుంచే కలెక్షన్లలో టాప్‌లో కొనసాగుతోన్న 'ధురంధర్' 21వ రోజు రూ.26 కోట్లను సాధించింది. ప్రపంచ వ్యాప్తంగా విడుదలైన ఈ సినిమా ఇప్పటి వరకూ రూ.1006కోట్లు వసూలు చేసింది . 21వ రోజు కూడా ప్రపంచవ్యాప్తంగా 4,753 థియేటర్‌లలో విజయవంతంగా అలరించింది. భారత్‌లో రూ.668 కోట్లు వసూళ్లు చేసినట్లు సినీ వర్గాలు తెలిపాయి. దీంతో ఇప్పటి వరకూ ఉన్న పలు బ్లాక్‌బస్టర్ చిత్రాల రికార్డులను ఇది అధిగమించింది. స్త్రీ 2 (రూ.598 కోట్లు), ఛావా (రూ.601 కోట్లు)లను బీట్ చేసి టాప్ వన్‌లోకి వచ్చేసింది. దర్శకుడు ఆదిత్య ధర్ కెరీర్‌తో పాటు నటుడు రణ్‌వీర్ సింగ్ కెరీర్‌లోనూ అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాగా నిలిచింది. మరోవైపు 'ధురంధర్ 2' కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి 19న సీక్వెల్ విడుదల కానుంది. అంతేకాదు, హిందీతో పాటు, దక్షిణాది భాషల్లోనూ ఈ సినిమాను విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం పార్ట్ 2 పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి.



# 'నాకు ఎమోషనల్ డే'.. తనయుడి సక్సెస్‌పై సాయికుమార్

తన కుమారుడు, నటుడు ఆది విజయంపై హర్షం వ్యక్తం చేశారు సాయి కుమార్ . ఆది నటించిన 'శంబాల' సక్సెస్‌కు ఎమోషనల్ అయినట్లు పేర్కొన్నారు. ఈ సినిమా గురువారం విడుదలైన సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు.''ఇది నాకు ఎమోషనల్ డే. ఆది తొలి సినిమా 'ప్రేమ కావాలి' ఫస్ట్ డే ఫస్ట్ షో విజయనగరంలో చూశాక పైడితల్లి అమ్మవారిని దర్శించుకున్నా. ఇప్పుడు 'శంబాల'కూ హౌస్‌ఫుల్ బోర్డులు కనిపిస్తున్నాయి. నేను ఈ మూవీ లోగో ఉన్న టీషర్టు వేసుకుని, చిన్న పిల్లాడిలా హైదరాబాద్‌లోని పలు థియేటర్లకు వెళ్లా. అక్కడ తెలిసిన వారంతా 'సర్.. అబ్బాయి విజయం సాధించాడు' అంటుంటే ఎంతో ఆనందపడ్డా. ఓ థియేటర్ వద్ద ఎమోషనల్ అయ్యా. ఆది సక్సెస్ కోసం అందరం ఎదురుచూశాం. మధ్యలో కొన్ని మంచి సినిమాల్లో నటించినా ఆశించిన స్థాయిలో ఫలితం దక్కలేదు. విడుదలైన అన్ని ప్రాంతాల్లోనూ 'శంబాల' విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. విషెస్ మెసేజ్‌లు మాకు ఇంకా వస్తూనే ఉన్నాయి. కొందరు తమదైన శైలిలో రివ్యూలు పంపిస్తున్నారు. ఇందులోని పలు అంశాల గురించి చర్చించుకుంటున్నారు'' అని సాయికుమార్ పేర్కొన్నారు.

# కొత్త ఏడాదిలో ప్రేమ ముచ్చట్లు



వైవిధ్యమైన కథలతో ప్రేక్షకుల్ని అలరిస్తోంటుంది అందాల తార అలియా భట్. ప్రస్తుతం ఆమె ఖాతాలో 'లవ్ అండ్ వార్' సినిమా ఉన్న సంగతి తెలిసిందే. ఆమె, రణ్‌బీర్ కపూర్ జంటగా నటిస్తున్న చిత్రమిది. ప్రముఖ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వం వహిస్తున్నారు. విక్కీ కౌశల్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోన్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్‌లుక్‌ను జనవరిలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ''కొత్త సంవత్సరం సందర్భంగా ప్రేక్షకులకు అలియా ప్రేమ ప్రపంచాన్ని పరిచయం చేయాలనే ఆలోచనలో ఉంది చిత్రబృందం. త్వరలో చివరి షెడ్యూల్ చిత్రీకరణ ప్రారంభం కానుంద''ని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. రొమాంటిక్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా వచ్చే ఏడాది థియేటర్లలోకి రానుంది.

# ఈషా లక్ష్యంగా వ్యతిరేక ప్రచారం



తమ 'ఈషా' సినిమాను లక్ష్యంగా చేసుకుని సామాజిక మాధ్యమాల్లో కొంతమంది వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు చిత్ర సమర్పకుడు కె.ఎల్.దామోదర్‌ప్రసాద్. త్రిగుణ్, అఖిల్‌రాజ్, హెబ్బా పటేల్, సిరి హనుమంతు ప్రధాన పాత్రధారులుగా... శ్రీనివాస్ మన్నె దర్శకత్వంలో తెరకెక్కిన 'ఈషా' గురువారమే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఆన్‌లైన్ టికెట్ విక్రయ వేదిక తోపాటు, ఇతర సామాజిక మాధ్యమాల్లోనూ కొంతమంది సినిమాపై వ్యతిరేక ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ చిత్రబృందం విలేకర్ల సమావేశాన్ని నిర్వహించింది.

సినిమాని విడుదల చేసిన వంశీ నందిపాటి మాట్లాడుతూ ''ఒక మంచి సినిమాని ఇలా దెబ్బ తీయాలనుకోవడం దారుణం. సినిమాకు మంచి వసూళ్లు దక్కుతున్నాయి. అయినా సరే, కొంతమంది డబ్బు ఖర్చు చేసి మరీ వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారు. కొంతమంది సినిమాని చూడకుండానే సామాజిక మాధ్యమాల్లో వ్యతిరేక అభిప్రాయాల్ని వెలిబుచ్చుతున్నారు. ఎవరెన్ని చేసినా మా సినిమా విజయాన్ని అడ్డుకోలేరు'' అన్నారు. కేఎల్ దామోదర్‌ప్రసాద్ మాట్లాడుతూ ''సామాజిక మాధ్యమాల్లో ఇలాంటి మాఫియా ఎదగడం చిత్ర పరిశ్రమలో ఎవరికీ మంచిది కాదు. కావాలని సినిమాని కిందకు లాగుతున్న ఎవ్వరినీ వదిలిపెట్టం. ఒక చిన్న చిత్రానికి ఇలాంటి వసూళ్లు మాకెంతో సంతోషాన్నిస్తోంది'' అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత బన్నీ వాస్, చిత్ర నిర్మాత హేమ వెంకటేశ్వరరావుతోపాటు ఇతర చిత్రబృందం పాల్గొంది.

# కడుపుబ్బా నవ్వులతో..

'మత్తు వదలరా 2' విజయం తర్వాత నటుడు సత్య.. దర్శకుడు రితేశ్ రానా కలయికలో రూపొందుతున్న కొత్త చిత్రం 'జెట్లీ'. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో చిరంజీవి, హేమలత పెద్దమల్లు నిర్మిస్తున్నారు. రియా సింఘా కథానాయిక. ఈ సినిమాలో వెన్నెల కిశోర్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆయన పాత్రకు సంబంధించిన ఫస్ట్‌లుక్‌ను గురువారం విడుదల చేశారు. అందులో తను విమానం విండో సీట్ దగ్గర కూర్చొని స్టైలిష్ హెయిర్ స్టైల్‌తో.. చేతిలో సినిమా సుదోకు అనే పుస్తకంతో ఫన్నీగా కనిపించారు. ''ఇది వినూత్నమైన కథ.. రితేశ్ మార్క్ వినోదంతో నిండి ఉన్న చిత్రంగా ముస్తాబవుతోంది. తప్పకుండా ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్విస్తుంది'' అని చిత్ర బృందం తెలిపింది. ఈ సినిమాకి సంగీతం: కాల భైరవ, ఛాయాగ్రహణం: సురేశ్ సారంగం.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY DHEEKONDA SHIVAKRISHNA, PRINTER TELUKALA BHASKAR REDDY, PRINTED AT RAINBOW OFFSET PRINTERS,6-8-142, SAGARA VEEDHI CHOWRASTHA, HANUMAKONDA, WARANGAL,TELANGANA-506001.PUBLISHED AT: H.NO: 7-37, ZAFFERGADH ROAD, WARDHANNAPET, WARANGAL, TELANGANA- 506313.
EDITOR: DHEEKONA SHIVAKRISHNA. PRGI NO: TGTEL/25/A0438, CELL: 9700950084, 9948206302, email: startrinethram28@gmail.com